అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శనివారం 20 మే 2023

ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షునిగా శివకుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ ముదిరాజ్ మహాసభ రి.నెం. 443/14 నిజామబాద్ జిల్లా అధ్యక్షునిగా మెతుకు శివకుమార్ ముదిరాజ్‌ను నియమించారు. ఈ మేరకు శుక్రవారమిక్కడ తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు బండ ప్రకాశ్.. నియామకపత్రం అందజేశారు. ముదిరాజ్‌లను ఐక్యం చేస్తూ జిల్లాల కమిటీలను, జిల్లా అనుబంధ విభాగాలను నిర్మాణం చేయడం ద్వారా ముదిరాజుల అభ్యున్నతికి, పురోగతికి, సంక్షేమానికి, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో పురోగాభివద్ధికి కషిచేయాలని సూచించారు.


నియామకపత్రం అందజేత

కలెక్టర్‌తో సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు భేటీ

నవతెలంగాణ-నవీపేట్

జిల్లాలో సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సర్పంచులఫోరం జిల్లా అధ్యక్షులు ఆసోల్ల శ్రీనివాస్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం భేటీ అయ్యారు. సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలపై గత నెల 20న చలో కలెక్టరేట్‌తోపాటు నిరసన కార్యక్రమాలను చేపట్టగా శుక్రవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పందించి పలు సమస్యలను ఏటిఎస్ శ్రీనివాస్‌తో సమగ్రంగా చర్చించారు. సుమారు గంటన్నర పాటు సమస్యలపై డీపీవో జయసుధతో కలిసి మాట్లాడారు. రెండు వారాల్లో సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తానని స్పష్టమైన హామీ ఇచ్చినట్లు తెలిపారు.



మహనీయుడు.. సుందరయ్య

- సమసమాజ స్థాపనకు ఆదర్శవంత జీవితం గడిపారు
- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వర్ధంతి నివాళి

నవతెలంగాణ-కంఠేశ్వర్/బోధన్

సమ సమాజ స్థాపన లక్ష్యంగా ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపిన మహనీయుడు సుందరయ్య అని సీపీఐ(ఎం) నాయకులు వెల్లడించారు. భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి పురస్కరించుకొని నగరంలోని హమాల్‌వాడీలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ .రమేష్ బాబు మాట్లాడుతూ.. భారతదేశంలో ఉన్న భూస్వామ్య విధానాల మూలంగా ఫ్యూడల్ భావజాలంతో ప్రజల పైన జరుగుతున్న దోపిడీని, వివక్షతను అంతమొందించడానికి, సమ సమాజ స్థాపన లక్ష్యంగా అందుకు వర్గ పోరాటాల ద్వారా మాత్రమే విప్లవం సాధించవచ్చు అనే లక్ష్యంతో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం ద్వారా మాత్రమే దోపిడికి వ్యతిరేకం గా పోరాటాలు నిర్వహించి దోపిడి రహిత సమాజం నిర్మించాలని భావించినట్టు తెలిపారు. భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాతల్లో ఒకరైన పుచ్చలపల్లి సుందరయ్య ధనిక కుటుంబంలో జన్మించినప్పటికీ సాధారణ ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని అగ్రభాగాన ఉండి నిర్వహించి దున్నే వాడికి భూమి కావాలని లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూములను వద్ద ఉన్న భూములను పేదలకు పంచి స్వయానా తన ఆస్తులను కూడా పంచిన మహనీయుడని, సమాజమే తన కుటుంబంగా భావించి నిరంతరం ప్రజా సమస్యల పైన పరితపించిన వ్యక్తి అని కొనియాడారు. ప్రతిపక్ష పార్టీల నాయకుడిగా ఉన్నప్పటికీ ప్రజా సమస్యల పోరాటంలో అగ్రభాగాన ఉండి ఉద్యమాలు నిర్వహించిన వ్యక్తి అని కొనియాడారు. కుల, మత, లింగ విభేదాలను వ్యతిరేకిస్తూ కష్టజీవులందరూ ఐక్యంగా తమ హక్కుల కోసం పోరాడాలని పరితపించిన వ్యక్తి అని అన్నారు. నేటికీ సుందరయ్య అనేకమంది ప్రజాప్రతినిధులకు నేటి యువతరానికి ఆదర్శనీయంగా తీసుకోవలసిన అవసరం ఉందని వారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, నూర్జహాన్, ఎం గోవర్ధన్, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, అనిల్, నరసయ్య, దీపిక, గణేష్ తదితరులు పాల్గొన్నారు.


నగరంలోని పార్టీ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న నాయకులు..


నెహ్రూనగర్‌లో..

నెహ్రూ నగర్‌లో

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నెహ్రూ నగర్‌లో సుందరయ్య 39వ వర్ధంతి సభలను శుక్రవారం నిర్వహించారు. ఈ వర్ధంతి సభకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్లు హాజరై సుందరయ్య చిత్రపటానికి పెద్ది వెంకట్రాములు పూలమాల వేసి నివాళులు అర్పించగా, కాలనీవాసులు ఏర్పాటు చేసుకున్న ఎర్ర జెండాను నూర్జహాన్ ఎగరవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సుందరయ్య లాంటి మహానుభావులు సాధించి తెచ్చిన ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం కోసం మరో స్వతంత్ర పోరాటాన్ని చేయవలసి వస్తుందని అన్నారు. ప్రజా వ్యతిరేక శక్తులను తరిమికొట్టడమే సుందరయ్యకు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మన్సూర్, ఫరూక్, గంగామణి జరీనా, రాధిక, రైసా యాస్మిన్ వాసు ,రాములు, నాగమణిగంగమని రాణి పాల్గొన్నారు.


బోధన్‌లో..

వర్ధంతి నివాళి

బోధన్ : కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని శుక్రవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఊట్‌పల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీపీఐ(ఎం) బోధన్ ఏరియా కార్యదర్శి యేషాల గంగాధర్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో సిపిఐ(ఎం) పార్టీని నిర్మించిన అగ్రగన్యుడు పుచ్చలపల్లి సుందరయ్య అని అన్నారు. పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న పుచ్చల పల్లి సుందరయ్య సైకిల్ పై వెళ్లి ప్రజా సమస్యల పైన పార్లమెంటులో ప్రసంగించి సమస్యలు పరిష్కారం అయ్యేదాకా పోరాటం చేసిన గొప్ప నాయకుడని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ బోధన్ మండల నాయకులు దండు సాయిలు, సుంకరి లక్ష్మి, దండు స్వరూప, దండు రాణి, కరోల రుక్మవ్వ, రఘుపతి గంగమణి, బల్లెపు అనసూయ, దండు సావిత్రి, రఘుపతి హనుమవ్వ, రఘుపతి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


కాంటా అయినా లారీలు లేకపోవడంతో నిలిచిన ధాన్యం బస్తాలు

కాంటా అయినా కదలట్లే..

- ఎక్కడి ధాన్యం బస్తాలు అక్కడే

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద లారీలు లేక పడిగాపులు కాస్తున్నారు. కేంద్రాలలో ధాన్యం తూకాలు చేసి లారీలో లోడ్ చేసే వరకు రైతులదే బాధ్యత అని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చెబుతుండడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలాలలో సహకార సంఘం ఆధ్వర్యంలో 5 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లకు తరలించేందుకు లారీలు సకాలంలో రాకపోవ డంతో ఇదు రోజుల పాటు రైతులు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతు న్నారు. ఉన్నతాధికారులు రోజూ వారీగా సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అధికారులు దృష్టికి తీసుకెళ్లినా లారీలు రావట్లే

పెద్దకొడవ్‌గల్ సొసైటీ చైర్మన్ హనుమంత్‌రెడ్డి



లారీల కొరతపై రెండు మూడు రోజుల నుండి ఆర్డీవో, సివిల్ సప్లై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు లారీలు రాలేవు. లారీలు రాకపోవడంతో తూకం వేసిన ధాన్యం అక్కడే ఉంచడంతో రైతులు కాపలా ఉండాల్సి వస్తుంది. అధికారులు ఇట్టి విషయంపై తక్షణమే స్పందించి లారీలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

ఖరీఫ్ పంటలకు రైతన్నలు సిద్ధం

- బోరుబావుల కింద నారు సాగు షురూ


నాట్లకోసం నారు మడి

నవతెలంగాణ-ఎడపల్లి

ఖరీఫ్ వరి సాగుకు పలువురు రైతులు సన్నద్ధమవుతున్నారు. బోరుబావులు ఉన్న రైతులు.. నారుమల్లను సిద్ధం చేసి నారు పోశారు. ఎడపల్లి శివారులో, జైతాపూర్, తానాకలాన్, ఇబ్రహీంపూర్ రెవెన్యూ శివార్లలో పలువురు రైతులు ముందుగానే నారుమలను సిద్ధం చేసుకున్నారు. మరో పక్షం రోజులైతే నాట్లు వేసేందుకు సిద్ధంమువుతున్నారు. మిగతా రైతులు దుక్కులు చేపడుతున్నారు. ఎడపల్లి మండలంలో సుమారు 12వేల ఎకరాలలో వరి సాగుతున్నట్లు ఎడపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ప్రకృతి వైపరీత్యం ప్రభావం పడకుండా ముందస్తుగానే సాగు చేపడుతున్నట్టు రైతులు పేర్కొంటు న్నారు.

మా నాన్న.. అమ్మను కొడుతుండు

- పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బాలిక ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాలిక ఫాతిమా

నవతెలంగాణ-నసురుల్లాబాద్

మద్యం మత్తులో భార్యను పిల్లలను చిత్రహింసలు పెట్టడంతో ఓ బాలిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన తండ్రిపై ఫిర్యాదు చేసిన ఘటన బీర్కూర్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన లతీఫ్, గౌసియా బేగం కూతురు సిరిన్ ఫాతిమా(9) అనే బాలిక పోలీస్‌స్టేషన్‌కు ఏడ్చుకుంటూ వెళ్లింది. తన తండ్రి లతీఫ్ నిత్యం మద్యం సేవించి తన తల్లి గౌసియను చిత్రహింసలకు గురి చేస్తున్నాడని అడ్డువచ్చిన తనను కూడా విపరీతంగా కొడుతున్నాడని కన్నీరు పెట్టింది. తన తల్లిని తనను చంపేస్తానని బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఎట్టైనా సరే తన తండ్రి పై చర్యలు తీసుకోవాలంటూ వేడుకుంది. బాలిక ఫిర్యాదు మేరకు తండ్రిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-వేల్పూర్

లక్కోర గ్రామానికి చెందిన బీజేపీ, బీఎస్పీ నాయకులు అనిల్ దాసరి సుభాష్ గౌడ్ చిన్న హన్మండ్లు వారి అనుచరులు, అమీనాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ, బీఎస్పీ కార్యకర్తలు శుక్రవారం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో పార్టీలో చేరారు. వారందరికీ మంత్రి వేముల కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

స్కూళ్లో పనులు 12లోపు పూర్తికావాలి

- మిగతా స్కూళ్లల్లో కూడా మన ఊరు, మన బడి పనులు త్వరలో ప్రారంభిద్దాం
- కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-సదాశివనగర్

మన ఊరు మన బడిలో భాగంగా స్కూళ్లల్లో చేపట్టిన అభివృద్ధి పనులు జూన్ 12వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశించారు. స్కూళ్ల ప్రారంభమయ్యేలోగా చేపట్టిన పనులు పూర్తి చేయాలని సూచించారు. మండలంలోని ధర్మారావుపేట్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ శుక్రవారం పరిశీలించారు. స్కూల్లో జరుగుతున్న టువంటి మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులు జరుగుతున్న సందర్భంగా వాటిని పరిశీలించారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం బాగుందని ప్రతి సంవత్సరం ఇలాగే కొనసాగించాలని సూచించారు.

మన ఊరు మనబడి ప్రోగ్రాం కింద జెడ్‌పిహెచ్‌ఎస్ ధర్మారావుపేట్ స్కూల్కుడ కూడా రూ.36 లక్షలు మంజూరైనందున ఆ పనులకు కూడా త్వరలో టెండర్ పూర్తి చేసి పనులు ప్రారంభించుకుందామని చెప్పారు. ప్రైమరీ స్కూల్‌కు టాయిలెట్ నిర్మించడానికి 7,20,000 ఉపాధి హామీ నిధులను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే హై స్కూల్ కూడా ఉపాధి నిధులు 7,20,000 మంజూరైనట్టు తెలిపారు. టాయిలెట్స్ అతి త్వరలో నిర్మించాలని గ్రామ సర్పంచ్ భాస్కర్ రెడ్డికి సూచించారు. కిచెన్ షెడ్డు నిర్మాణానికి ఉపాధి నిధులను మంజూరు చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రైమరీ స్కూల్లో విద్యార్థుల సంఖ్య కనుగుణంగా ఉపాధ్యాయులు లేనందున గ్రామ సర్పంచ్ భాస్కర్ రెడ్డి కోరిక మేరకు అతి త్వరలో ఈ విద్యా సంవత్సరం వరకు ఇద్దరు టీచర్లను ఇవ్వాలని కోరగా వెంటనే స్పందించి విద్యాశాఖ అధికారి యూసఫ్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మహిపాల్ యాదవ్, యస్‌యంసీ వైస్ చైర్మన్ మంగళి బలరాం, తహశీల్దార్ ధన్వల్, ఎంపిఓ సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం పంచాయతీ సెక్రెటరీ గ్రామ యువకులు పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


పనుల పురోగతిపై సూచనలిస్తున్న కలెక్టర్


విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్

ఉత్తమ విద్యార్థిని అభినందించిన కలెక్టర్

పదో తరగతి ఫలితాల్లో 9 జీపీఏ సాధించిన మండలంలోని ధర్మారావుపేట్ గ్రామానికి చెందిన విద్యార్థిని శృతిని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అభినందించారు. ఉన్నత చదువులు చదవి మంచి పేరు సంపాదించుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎంపిపి గైని అనుసూయ, సర్పంచ్ బడాల భాస్కర్‌రెడ్డి, ఎంపిటిసి మహిపాల్ యాదవ్, ఎంఈఓ యూసఫ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నుంచి టీయూను ప్రక్షాళన చేయాలి

- ఐక్య విద్యార్థి సంఘాలు


మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ యూనివర్సిటీని అవినీతి నుండి ప్రక్షాళన చేసి అభివద్ధి చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ ఆధ్వర్యంలో నగరంలోని కాంగ్రెస్ భవన్‌లో శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎన్ఎస్‌యుఐ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, టీజీవీపి, పిడిఎస్‌సి, పి వై ఎల్, ఎల్ఎస్ఓ, ఏబీవీపీఎస్యు, టిఎన్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు వేణురాజ్ ,జన్నారపు రాజేశ్వర్ , రఘురాం, అనిల్ , గణేష్, కళ్యాణ్ , సాయి కష్ణ, సాయిరెడ్డి, కిరణ్ , యూసుఫ్ మాట్లా డారు. తెలంగాణ యూనివర్సిటీలో రిజిస్ట్రార్ పదవి కొట్లాటతో యూనివర్సిటీ పరువు తీస్తున్నా రని, విద్యార్థి సమస్యలను గాలికి వదిలేశారని అన్నారు. విద్యార్థులు ఫీజుల రూపంలో కట్టిన కోట్ల రూపాయలను వీసీ విచ్చల విడిగా ఖర్చు చేశారని, వీసీ అవినీతి, అక్రమ నియామకాలు, ప్రమోషన్స్ యూనివర్సిటీ బయట వ్యక్తులకు యూనివర్సిటీ డబ్బులు చెల్లించారని, అయినా రాష్ట్ర ప్రభుత్వం వీసీ పై చర్యలు తీసుకోవటం లేదని అన్నారు. ఇంత జరుగుతున్న జిల్లా ప్రజా ప్రతినిధులు స్పందించడం లేదని, పాలక మండలి తీర్మానాలను అమలు చేయటం లేదని, రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ వీసీ పై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో బాలికలకు వసతి గహం, ఆడిటోరియం, లైబ్రరీలో బుక్స్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. యూనివర్సిటీ ప్రక్షాళన కోసం యూనివర్సిటీ పరిరక్షణ సమితి గా ఏర్పాటు చేస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు మనోజ్,స్నేహిత,అశుర్, జ్వాల ఎన్ఎస్‌యుఐ నాయకులు నిఖిల్ రెడ్డి, సయ్యద్ అష్రాఫ్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉపకార పరీక్షలో సత్తా చాటిన నెమ్లి విద్యార్థులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్



కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలంలోని నెమ్లి జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు జాతీయ ఉపకార పరీక్షల్లో సత్తా చాటారు. బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని నెమ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు జాతీయ ప్రతిభాన్వేషణ పరీక్షలలో ప్రతిభ కనబరచి జాతీయ ప్రతిభా స్కాలర్షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ వెంకట్ రమణ తెలిపారు. ప్రతిభా స్కాలర్షిప్‌కు ఎంపికైన ముగ్గురు విద్యార్థులు 1.గంపల బాలాజీ, 2. ఆకుల హర్షిణి, 3. చాకలి హర్షవర్ధన్‌లు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ సందర్భంగా అభినందించారు. నెమ్లి హైస్కూల్ నుంచి ప్రతి సంవత్సరం జాతీయ స్కాలర్షిప్ ఎంపిక కావడం పట్ల మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి 12 వేల చొప్పున 5 సంవత్సరాలపాటు స్కాలర్షిప్ అందిస్తారని ప్రిన్సిపల్ తెలిపారు తెలిపారు.

'నకిలీ విత్తన' బెడద తగ్గేనా?

- ఖరీఫ్ సీజన్ ఆరంభంతో రైతుల్లో ఆందోళన
- నకిలీతో ప్రతియేటా సోయాబీన్ రైతు కుదేలు
- విత్తన కొనుగోలుపై నియంత్రణ ఎత్తివేత
- మహారాష్ట్ర నుంచి కొనుగోలు చేస్తున్న రైతన్న
- నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు : వ్యవసాయశాఖాధికారి తిరుమల ప్రసాద్



నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ఆరంభమవుతుండటంతో నకిలీ విత్తనాల బెడద జిల్లా రైతులను ఆందోళన కలిగిస్తోంది. నైరుతి తొలకరి పలకరించడంతో రైతాంగం ఒక్కసారిగా సాగులోకి వెళ్తుంది. సీజన్ ఆరంభంలో కొంత విత్తన కొరత ఏర్పడుతోంది. ఇదే అదునుగా కొంతమంది దళారులు నకిలీ విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పత్తి రైతులు ఈ నకిలీ విత్తనాలతో నష్టపోతుండగా.. నిజామాబాద్ ప్రత్యేక జిల్లా అయిన తరువాత సోయాబీన్ రైతులు నకిలీ విత్తనాల బారినపడుతున్నారు. అయితే వ్యవసాయశాఖ అడపాదడపా చర్యలు చేపడుతున్నా పూర్తిస్థాయిలో కట్టడి చేయడం లేదు. ప్రతియేటా ఏడు నుంచి ఎనిమిది కేసులు నమోదు చేసి మమ అనిపిస్తున్నారు. నకిలీ విత్తనాలను ఉపేక్షించొద్దని, అవసరమైతే పీడీ కేసులు నమోదు చేయాలని జిల్లా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పలుమార్లు వ్యవసాయాధికారులకు ఆదేశించిన విషయం తెలిసిందే.

వివరాలు మెయిన్‌లో..

లారీలు పంపాలని రైతుల రాస్తారోకో


రాస్తారోకో చేపట్టిన రైతులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ధాన్యం కాంటా వేసి వారం పది రోజులు గడుస్తున్నా.. తరలించడం లేదని రైతులు వాపోయారు. లారీలను పంపి ధాన్యం తరలించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని మెయిన్‌రోడ్డుపై శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం వద్ద సుమారు వారం రోజుల నుండి వడ్లు అలాగే ఉన్నాయని తెలిపారు. కాంటా వాటిని తీసుకెళ్లడం లేదని, లారీలు రావడం లేదని కాంటా పెట్టడం లేదని వాపోయారు. అధికారులు చొరువ చూపి వడ్ల కొనుగోలు కేంద్రానికి లారీలు పంపేలా చూడాలన్నారు. సుమారు గంట పాటు రైతులు రాస్తారోకో చేపట్టడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు.. అక్కడికి చేరుకొని రైతులను సముదాయించి ఆందోళన విరమింపజేశారు.

వివరాలు మెయిన్‌లో..

జీలుగ విత్తనాలు పంపిణీ



నవతెలంగాణ-భీంగల్

మండలంలోని ముచ్కూర్ సొసైటీలో రైతులకు జీలుగా విత్తనాలను ముచ్కూర్ సొసైటీ చైర్మన్ వెంకటేష్ నాయక్, జెడ్పీటీసి చౌట్‌పల్లి రవి, యంపిపి ఆర్మూర్ మహేష్ జీలుగ విత్తనాలను అందజేశారు. 2407 రూపాయలకు 30 కిలోల బస్తా 65 శాతం సబ్సిడితో రూ.842కు ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సంజీవ్, ఏయంసీ చైర్మన్ గుణవీర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య, రైతు బంధు మండల అధ్యక్షుడు శర్మనాయక్ ఏఈఓ లక్‌పతి, సొసైటీ కార్యదర్శి క్రాంతికుమార్, రైతులు పాల్గొన్నారు,

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవతరగతి 2003-2004 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. 19ఏళ్ళ నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి, రాజయ్య, గోదావరి, రాజేశ్వర్, జ్ఞానేశ్వర్, విద్యార్థులు నగేష్, శేఖర్, రఘు, భాను ,వినయ్, ఉమా రాణి, సుమలత, పాల్గొన్నారు

వీఆర్‌ఏల క్రమబద్ధీకరణ సంబరాలు

- సీఎం, మంత్రి, ఆర్టీసీ చైర్మన్ చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-విలేకరులు

జక్రాన్‌పల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసినట్టు వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు రొడ్డ సాయన్న తెలిపారు. క్యాబినెట్ సమావేశంలో వీఆర్‌ఏలను రెగ్యులర్ చేస్తున్నామని తెల్పడంతో మండలంలోని వీఆర్‌ఏలు రెవెన్యూ అధికారుల సమక్షంలో సీఎం, ఆర్టీసీ చైర్మన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, సర్వేయర్ రత్నాకర్, బండి గంగాధర్, షేక్ సాదుల్ల పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మండలంలోని వీఆర్‌ఏలు తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో వీఆర్‌ఏల క్రమబద్ధీకరణకు ఆమోదం తెలిపినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షులు దుబ్బాక శ్రీకాంత్ మాట్లాడుతూ వీఆర్‌ఏలను క్రమబద్ధీకరణ చేసినందుకు సీఎం కేసీఆర్, సహకరించిన మంత్రి ప్రశాంత్ రెడ్డిలకు రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో మండల వీఆర్‌ఏలు బాలు, లక్ష్మణ్, శ్రావణ్, మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లి : పాలాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు



వేల్పూర్ :మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీఆర్‌ఏలు

నవీపేట్: గ్రామ సేవకులను రెగ్యులర్ చేస్తూ క్యాబినెట్లో ఆమోదం తెలిపిన సందర్భంగా కేఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి టపాకాయలు పేల్చి తహసిల్దార్ కార్యాలయం ఎదుట సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వీఆర్ఏ మండల అధ్యక్షులు పెంటయ్య మాట్లాడుతూ వీఆర్‌ఏలు రెగ్యులర్ గురించి ఎంతో కాలం నుండి వేచి చూస్తున్నారని వారి ఆశలను నెరవేర్చిన ముఖ్యమంత్రి కేసీఆర్, క్యాబినెట్ మంత్రులు, ఎమ్మెల్యేలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లక్ష్మణ్,కార్యదర్శి పండరి, కోశాధికారి ప్రభాకర్, గౌరవ అధ్యక్షులు నరేష్, ముఖ్య సలహాదారులు రంజిత్, నర్సయ్య, అష్షు తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి : రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏకు గతంలో ఇచ్చిన హామీకి కట్టుబడి క్యాబినెట్‌లో రాష్ట్రంలోని సుమారు 7 వేలకు పైగా ఉన్న వీఆర్‌ఏలకు రెగ్యులర్ చేస్తూ తీసుకున్న నిర్ణయంపై మండల విఆర్‌ఏలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలకేంద్రంలో కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా విఆర్‌ఏల డివిజన్ అధ్యక్షుడు చెలిమెల రాములు, మండల అధ్యక్షుడు లోక్కిడి హరిచరణ్ మాట్లాడుతూ.. జూన్ 2 నుండి జరగబోవు రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో తమకు రెగ్యులర్ చేసిన జీఓ జారీచేసి తమకు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెఏసి కిరణ్, సరిత, వీణనంద్, శ్రీకాంత్, నర్సయ్య, ఉస్మాన్, సాదిక్ పాల్గొన్నారు.

ఆర్మూర్ : ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలను క్యాబినెట్ లో ఆమోదించిన శుభ సందర్భంగా ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే జీవన్ రెడ్డి చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలూరు మండల అధ్యక్షులు గున్నం సంతోష్, ప్రధాన కార్యదర్శి మల్లయ్య, కోశాధికారి సంపత్ గంగారం, సుమన్, వంశీ, పోతన్న, సరిత, గీత, కళావతి, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

మాక్లూర్ : మండలంలో వీఆర్‌ఎలు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో మండల వీఆర్ఎ జేఏసీ వైస్ ప్రెసిడెంట్ బేగరి రాజేశ్వర్, సెక్రటరీ జాఫర్, కోష అధికారి కార్తీక్, ముఖ్య సలహాదారుడు సిలర్ హిమ్మద్, జనార్దన్ గౌడ్, శ్రీనివాస్, సౌజన్య పాల్గొన్నారు.

వేల్పూర్: వీఆర్ఏ లను రెగ్యులరైజ్ చేయడంతో మేల్పూర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రమన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వీఆర్‌ఏల సంఘం సభ్యులు శుక్రవారం మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

మోపాల్: తమ ఉద్యోగాలకు పర్మినెంట్ చేసినందున. ముఖ్యమంత్రి కేసీఆర్, రూరల్ ఎమ్మెల్యే ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ చిత్రపటాలకు వీఆర్ఏ జె ఏసి కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఆఫీస్ ఎదుట పాలాభిషేకం చేశారు. మండల జేఏసీ కమిటీ అధ్యక్షుడు బియ్య సాయినాథ్ మాట్లాడారు. కార్యక్రమంలో కె గంగారం కంజర్ల శ్రీనివాస్, తుంగపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం తంజీమ్ అధ్యక్షులుగా షేక్ రహీముద్దీన్

నవతెలంగాణ-ముప్కాల్

బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్ గ్రామంలో శుక్రవారం ముస్లిం తంజీమ్ నూతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని మండల ప్రధాన కార్యదర్శి షేక్ యూసుఫ్ తెలిపారు. కమిటీ అధ్యక్షులుగా షేక్ రహీముద్దీన్, ఉపాధ్యక్షులుగా ఎంఏ. ఖాలీద్, ప్రధాన కార్యదర్శిగా షేక్ యూసుఫ్, సంయుక్త కార్యదర్శిగా షేక్ అన్వర్, కోశాధికారిగా ఎండి. వాహెద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు షేక్ రహీముద్దీన్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ పదవి కట్టబెట్టిన ముస్లిం తంజీమ్ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముస్లిం తంజీమ్ కోసం కృషి చేస్తానని, సభ్యులకు అందుబాటులో ఉంటానని అన్నారు. కమిటీ సభ్యులుగా షేక్ మున్వర్, హసీబ్, యూసుఫ్ బేగ్, షేక్ జాకీర్, షేక్. వాజీద్, కమిటీ సలహాదారులుగా షేక్ బాబా, ఎండి మోహిద్ పాషా, అహ్మద్ హుస్సేన్, అబ్దుల్ మాజీద్, షేక్ నియాజ్ హుస్సేన్‌ను ఎన్నుకున్నారని తెలిపారు. కమిటీ పదవికాలం రెండు సంవత్సరాల కాలం పాటు కొనసాగుతుందని మండల ప్రధాన కార్యదర్శి షేక్ యూసుఫ్ తెలిపారు.

ఏకగ్రీవంగా వీఆర్‌ఏల కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన వీఆర్ఏ కార్యవర్గ సభ్యులు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు సిఏచ్. గంగాధర్, అధ్యక్షులుగా సయ్యద్ జాఫర్, ఉపాధ్యక్షులుగా బేగరి రాజేశ్వర్, టి. జనార్దన్ గౌడ్, ప్రధానకార్యదర్శిగా శిరార్ అహ్మద్, కోశాధికారిగా పి. గంగాధర్, సంయుక్త కార్యదర్శిగా బి. ముత్యం, ముఖ్య సలహాదారుడు ఎన్. పోశెట్టి (ప్రభుదాస్) కార్యవర్గ సభ్యులుగా బండి సంజీవ్, ఎన్. రాజన్న, ఏం. నవీన్, పి. దిలీప్, ఎస్. శ్రీనివాస్, టి. కార్తీక్, టి. కిషోర్, బి. విజయ్, పి. భూషణ్ ఎన్. నాగభూషణం, సంధ్య వై.ముకుందను ఎన్నుకున్నారు.

పర్సంటేజ్ పనులకే ప్రాధాన్యత

నవతెలంగాణ-మోర్తాడ్

నియోజకవర్గంలో పర్సంటేజ్ వచ్చే పనులకు మంత్రి ప్రాధాన్యత ఇస్తున్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని వడ్యాట్ గ్రామంలో నిర్వహించిన హాత్ సే హాత్ జోడో భాగంగా ఆయన మాట్లాడారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి పర్సంటేజ్ పనులే తప్ప ఇతర ప్రజా సమస్యలు పట్టించుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. ఉపాధి కూలీలకు సరైన వేతనం రావడం లేదని సరైన సమయంలో కూలీలకు డబ్బులు రాక ఇబ్బందులు పాలవుతున్న పట్టించుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. చెక్ డ్యాముల నిర్మాణం పై ఉన్న ధ్యాస ప్రజా సమస్యలో చూపితే ఉపయోగమవుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని, రైతులకు రెండు లక్షల రుణమాఫీ, 500 రూపాయలకే వంట గ్యాస్, నిరుపేదలకు ఇండ్లు నిర్మించి ఇచ్చే పథకాన్ని మళ్లీ కొనసాగిస్తామని అన్నారు. గ్రామంలోని త్రీడీ యూత్ క్లబ్ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాములు, ఎస్సి సెల్ అధ్యక్షులు ఆనంద్, నాయకులు మరళి, సంతోష్, రాజశేఖర్, మహిపాల్, సుధీర్, అశోక తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన తిర్మన్‌పల్లి విద్యార్థిని

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నెషనల్ మిన్స్ కామ్ మేరిట్ స్కాలర్ షిప్ ఎన్ఎంఎంఎస్ జరిగిన ప్రతిభ పరీక్షలో ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన 8 వ తరగతి విద్యార్థి కుమారి శెట్టి స్పందన ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రావు తెలిపారు.శుక్రవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఎంపిటిసి చింతల దాస్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ధర్పల్లి ప్రభాకర్, ఎస్ఎంసి చైర్మెన్ ఇమ్మడి సాయిలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి కష్ట పడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని, 9 వ తరగతి నుండి ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం వరకు ప్రతి ఏటా 12వేల రూపాయలు స్కాలర్ షిప్ లభిస్తుందని వారన్నారు.



క్వారీలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి హస్తం ఉంది

- బట్టాపూర్ క్వారీలో ఈటీఎస్ సర్వే చేపట్టాలి
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బీజేపీ నేత మల్లికార్జున్ రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అక్రమ క్వారీలో మంత్రి ప్రశాంత్ రెడ్డి హస్తం ఉందని బిజెపి నాయకుడు మల్లికార్జున్ రెడ్డి ఆరోపించారు. ఏర్గట్ల మండలంలోని బట్టాపూర్ గ్రామంలో ఏడేళ్లుగా పర్యావరణ అనుమతులు లేకుండా నడుస్తున్న క్వారీలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని, దీనిపై ఈటీఎస్ (ఎలక్ట్రానిక్ టోటల్ స్టేషన్) సర్వే నిర్వహించి నిజాలు నిగ్గు తేల్చాలని బాల్కొండ నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ నాయకులు మల్లికార్జున్ రెడ్డి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును కోరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ క్వారీ లీజుకు తీసుకున్న జియో స్టోన్ ఇండస్ట్రీస్ 10వేల క్యూబిక్ మీటర్లకు అనుమతులు తీసుకొని, 12 లక్షల క్యూబిక్ మీటర్లకు పైగా తరలించారని,అన్నారు. 2021 నవంబర్ వరకు క్రషర్ నడిపేందుకు అనుమతులు కూడా లేవని, ఈ క్వారీ స్కాంలో మంత్రి ప్రశాంత్ రెడ్డి హస్తం ఉందని ఆరోపించారు. మార్కెట్‌కు సరుకు తరలించేందుకు రిజర్వ్ ఫారెస్ట్ లో బండ్లబాట వెళ్లాల్సి ఉండగా కంకర రోడ్డు వేసారని, దీన్ని పరిశీలించడానికి వచ్చిన అప్పటి రేంజ్ ఆఫీసర్ ను మంత్రి ప్రశాంత్ రెడ్డి 24 గంటల్లో బదిలీ చేయించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఆరు నెలల కితం తాను ఫిర్యాదు ఇవ్వడంతో 50 లక్షల రూపాయలు క్వారీ కరెంట్ బిల్లులు కట్టారని తెలిపారు. అనుమతులకంటే అధికంగా కంకర తరలించారని ఆరు నెలల క్రితమే హైదరాబాద్‌లోని గనుల శాఖ డైరెక్టర్ కు ఫిర్యాదు చేశామని చెప్పారు. ఈటిఎస్ సర్వే నిర్వహించాలని అసిస్టెంట్ డైరెక్టర్ నిజామాబాద్‌కి ఆదేశాలు ఇస్తే సర్వేకు డబ్బులు జమ చేయాలని లీజు సంస్థకి అధికారులు లేఖల ద్వారా తెలిపినా ఇప్పటికీ జమ చేయలేదని అన్నారు. సుప్రీం కోర్ట్ గైడ్ లైన్స్ ప్రకారం కనీసం 200 కోట్లకు పైగా జరిమానా పడే అవకాశం ఉందని తెలిపారు. కలెక్టర్ స్పందించి ఇకనైనా సర్వే నిర్వహించి వాస్తవాలను వెలికి తీయాలని తెలిపారు. లేకుంటే ఆందోళనలు చేపడతామన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మల శ్రీనివాస్, భారతీయ జనతా పార్టీ మండలాల అధ్యక్షులు నారాయణరెడ్డి, మహిపాల్, సంజీవ్, పెద్ద ఎత్తున బట్టాపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు, రేపు టాటా ఐపీఎల్ ఫన్ పార్క్

- హెూరెత్తించనున్న ఐపీఎల్ మ్యాచ్‌లు
- ఉచితంగా పెద్ద స్క్రీన్‌లో వీక్షించే అవకాశం



మాట్లాడుతున్న ఇర్ఫాన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

టాటా ఐపిఎల్ ఫన్ పార్క్‌ను ఈనెల 20, 21 న నిజామాబాద్ లోని కంఠేశ్వర్ ప్రాంతంలోని ఉమెన్స్ ఎడ్యుకేషనల్ గ్రూప్ కళాశాల మైదానంలో పెద్ద పెద్ద స్క్రీన్‌లతో వీక్షించే అవకాశం ఉందని జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ వెంకట్ రెడ్డి, బీసీసీఐ ప్రతినిధి ఇర్ఫాన్ అన్నారు. శుక్రవారం ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం వారు మాట్లాడుతూ.. టాటా ఐపీఎల్ ప్రతిరోజు రెండు మ్యాచ్‌లు మధ్యాహ్నం 3:30 కి సాయంత్రం 7:30 కి శని ఆదివారం ఈనెల 20, 21న వీక్షించే అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. అభిమానుల కోసమే అలరించనుందని, క్రికెట్ ఆటగాళ్లు, ఇష్టమైన జట్టు మరెన్నో ఐపీఎల్ 2023 పట్ల తమకున్న ప్రేమను వ్యక్తపరిచే అత్యంత క్రేజీ అభిమానులతో ఫ్యాన్స్‌ను ఆకర్షిస్తుందని అన్నారు. 45 నగరాల్లోని ఈ అభిమానులను టచ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఐపీఎల్ ఫీవర్‌ను టేకోవర్ చేయడానికి ఫ్యాన్ పార్కులు సిద్ధం చేశామని అన్నారు. ప్రతి ఉత్కంఠ భరితమైన క్షణాన్ని జాయింట్ స్క్రీన్‌లపై చూపిస్తూ, ప్రతివేదిక అభిమానులకు స్టేడియం లాంటి అనుభూతిని అందించే లైవ్ యాక్షన్ షోను ప్రసారం చేస్తుందని ప్రవేశం పూర్తిగా ఉచితమని, ఐపీఎల్ అధికారిక స్పాన్సర్ల ద్వారా సంగీతం, ఫుడ్ స్టాల్స్, పానీయాలు, కొన్ని సరదా యాక్టివేషన్ లతో వినోదం మరింత ఉత్సాహం రెట్టింపు అవుతుందని అందుకు అభిమానులందరూ దీన్ని ఎట్టి పరిస్థితుల్లో వదులుకోవద్దని అన్నారు. చాలా సరదాగా అభిమానులు తమ జట్లను ఉత్సాహపరుస్తూ స్టేడియంలో ఉన్నారని ఇప్పటికే భావించవచ్చని, త్రిల్‌తోపాటు ఉత్సాహాన్ని జోడించడానికి ఫ్యాన్స్ పార్కులను సందర్శించేవారు తమ అభిమాన జట్టు ఆటగాడు, క్రికెట్ పట్ల తమ ప్రేమను వ్యక్తపరిచి, తమ అభిమానుల సంతోషాన్ని ప్రదర్శించడానికి, అర్హులని ఆటగాళ్ల సంతకం చేసిన జెర్సీలను లక్కీ డ్రా ద్వారా ఇస్తామని అన్నారు. ప్రతి సీజన్ మునుపటి కంటే పెద్దదిగా మారుతుందని అన్నారు. ఈసారి ఐదు లక్షల కంటే ఎక్కువమంది క్రికెట్ ఫ్యాన్స్ పార్కుల వద్ద క్రేజీని ఆనందిస్తారని అన్నారు. బౌండరీలు, హైట్రిక్లు, స్పిన్‌లోని హిట్‌లను చూసేందుకు మీ నగరంలోని సమీప ఫ్యాన్ పార్క్ వద్దకు అభిమానులు పెద్ద సంఖ్యలో రావాలని కోరారు. గర్భిణులు, వృద్ధులు, వికలాంగులకు కింద కూర్చోలేని వారికి చైర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రికెట్ అసోసియేషన్ కోశాధికారి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ సురేష్ పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య వారసత్వాన్ని కొనసాగించాలి



నవీపేట్: నివాళ్లు అర్పిస్తున్న నాయకులు



ఆర్మూర్‌లో..



మాక్లూర్ : రాంచంద్రపల్లిలో..

నవతెలంగాణ-ఆర్మూర్/ మాక్లూర్/నవీపేట్

పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని శాస్త్రి నగర్ కార్యాలయంలో నిర్వహించారు. సుందరయ్య ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నాయకులు కూతాడి ఎల్లయ్య మాట్లాడుతూ నెల్లూరు జిల్లా అలగానిపాడు గ్రామంలో సుందరయ్య పుట్టారన్నారు. తన 17వ ఏటనే స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. సైమన్ కమిషన్ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారని అన్నారు. దీంతో బ్రిటిష్ ప్రభుత్వం రాజమండ్రి డోర్నకల్ స్కూల్లో ఉంచారన్నారు. అదే స్కూల్లో కమ్యూనిస్టులతో పరిచయాలు ఏర్పడి అమీర్ హైదర్ ఖాన్‌తో అప్పుడే భారతీయ కమ్యూనిస్టు పార్టీలో చేరారని చెప్పారు. హైదర్ ఖాన్ అరెస్ట్ తర్వాత దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని పెంచే బాధ్యత కేంద్ర కమిటీ సుందరయ్యకు అప్పజెప్పిందన్నారు. అప్పుడు ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు శాఖను ఏర్పాటు చేశారని తెలిపారు. అదే స్ఫూర్తితో సుందరయ్య 1936లో అఖిల భారత కిసాన్ సభను ప్రారంభించారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాజు కుల్దీప్ శర్మ రాజయ్య గుండ్ల భూమేశ్వర్, రఫీక్, షాహిదా బేగం తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్ : ఆలూరు మండలలోని రామచంద్ర పల్లి గ్రామంలో సిపిఎం పార్టీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సుందరయ్య వర్ధంతిలో సిపిఎం మండల కార్యదర్శి కొండ గంగాధర్ మాట్లాడుతూ సుందరయ్య తన భూమి 100 ఎకరాలు పేదలకు పంచిన మహనీయుడని అన్నారు. పార్టీ నిర్మాణానికి తన సర్వస్వం ధారపోసిన ఆయన ఆశయ సాధనకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో వడ్డెర వత్తిదారుల రాష్ట్ర అధ్యక్షుడు విడగొట్టు సాయిలు, సాయికుమార్, పల్లపు చిన్ను బాయ్, ముద్దంగుల లక్ష్మి, గ్యారంగుల సుకన్య, పార్టీ సభ్యులు గ్యారంగుల ఎల్లవ్వ, పల్లపు లత, సిరిసి లావణ్య పాల్గొన్నారు.

నవీపేట్: పుచ్చలపల్లి సుందరయ్య వారసత్వాన్ని కొనసాగించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నాయక్‌వాడి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని సుందరయ్య కాలనీలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయక్ వాడి శ్రీనివాస్ మాట్లాడుతూ .. సుందరయ్య చిన్ననాటి నుండి బ్రిటిష్ సామ్రాజ్యవాదంపైన పోరాడే వారని చిన్న వయసులోనే జైలు జీవితం గడిపారని అన్నారు. 1952లో ఎంపీగా గెలిచిన సైకిల్‌పై వెళ్లారని తెలిపారు. పశ్చిమబెంగాల్, త్రిపుర, కేరళలలో సిపిఎం పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ఆయన పాత్ర కీలకమైందని అన్నారు. బిజెపి ఎంపీ భూషణ్ సింగ్‌ను అరెస్టు చేసి మల్లయోధులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సావిత్రి, సుశీల, సిఐటియు నాయకులు మేకల ఆంజనేయులు, రైతు సంఘం నాయకులు కిషన్, దగడు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలం

- పార్టీ కోసం పని చేసిన వారికి సముచిత గౌరవం
- కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో నెంబర్ వన్ అయ్యింది
- బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



పార్టీ కండువాలు వేస్తున్న మంత్రి

నవతెలంగాణ-వేల్పూర్

బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలమని,పార్టీ కోసం పని చేసిన వారికి కచ్చితంగా సముచిత గౌరవం దక్కుతుందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్ మండలం క్లస్టర్-2 గ్రామాల బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి - నీరజా రెడ్డి దంపతులు సతీ సమేతంగా పాల్గొన్నారు. ఆయా గ్రామాల పార్టీ శ్రేణులతో ఆప్యాయంగా మాట్లాడారు. ఫొటోలు దిగారు. మంత్రి వేముల దంపతులు సమ్మేళన ప్రాంగణమంతా కలియ తిరుగుతూ అందరినీ పేరుపేరునా పలకరిస్తూ ఆత్మీయతను చాటుకున్నారు. బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. మీటింగ్ కు వచ్చిన వారికి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి దంపతులు భోజనాలు వడ్డించారు.వారితో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడారు. 'మాతండ్రి వేముల సురేందర్ రెడ్డి కోసం ఆనాడు పనిశారని, నేడు నాతో పని చేస్తున్నారని, ఇది అరుదుగా లభించే గౌరవం అని, ఏమిచ్చినా మీ ఆప్యాయత రుణం తీర్చుకోలేనిది' అని మంత్రి భావోద్వేగానికి లోనయ్యారు.వెనుకో ముందో కష్ట పడే వారికి పదవులు తప్పక లభిస్తాయని అన్నారు. పార్టీ జెండా మోసే వారిని,పార్టీ కోసం పని చేసేవారిని అధినేత కేసిఆర్ కడుపులో పెట్టుకొని కాపాడు కుంటారన్నారు. పార్టీ కోసం పని చేసిన వారికి పదవి కచ్చితంగా వరిస్తుంది అన్నారు. కేసిఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో నెంబర్ వన్ అయ్యిందని గుర్తు చేశారు. కరువు ప్రాంతం నేడు దేశానికే అన్నం పెడుతున్న రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందన్నారు. బండి సంజయ్ దశాబ్ది ఉత్సవాలను కేసిఆర్ కుటుంబ ఉత్సవాలు అనడం ఆయన అవివేకమని మండిపడ్డారు. పసుపు బోర్డు పేరుతో రైతులను నిండా ముంచిన బీజేపీని నమ్మే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ప్రతి గ్రామంలో కోట్లల్లో అభివృద్ధి కనిపిస్తుందని, అభివృద్ధిపై గ్రామాల్లో చర్చ జరిగేలా బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు చొరవ తీసుకోవాలన్నారు. బాల్కొండ బిఆర్ఎస్ కుటుంబ సభ్యులకు ఏ ఆపదా వచ్చిన తోడుగా నిలబడతానని బీఆర్ఎస్ శ్రేణులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా లక్కోర గ్రామానికి చెందిన బీజేపీ, బీఎస్పీ నాయకులు, అమీనాపూర్ గ్రామ బీఎస్పీ, బీజేపీ నాయకులు పార్టీలో చేరారు. వారికి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ విఠల్ రావు, డిసిసిబి వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ మధు శేఖర్, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


శానిటేషన్ డ్రైవ్ తనిఖీ

నవతెలంగాణ-వేల్పూర్

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా వడ్డెర కాలనీ గ్రామపంచాయతీని సి ఆర్ డి డిస్టిక్ కో ఆర్డినేటర్ నాగభూషణం ఆకస్మిక తనిఖీ చేశారు. దీంట్లో భాగంగా గ్రామంలో ఉన్న పరిసరాల పరిశుభ్రత ప్లాస్టిక్ మేనేజ్మెంట్ డ్రైనేజీ క్లీనింగ్ నెస్ పల్లె ప్రకృతి వనం, నర్సరీ, గ్రామపంచాయతీ తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపీడీవో, ఎంపీఓ, ఏపీఓ టెక్నికల్ అసిస్టెంట్లు గ్రామపంచాయతీ సెక్రటరీ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రైతుల బాధ తెలిసిన వ్యక్తి సీఎం కేసీఆర్

జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి



మాట్లాడుతున్న చౌట్‌పల్లి రవి

నవతెలంగాణ-భీంగల్

రైతాంగం బాధలు తెలిసిన గొప్ప వ్యక్తి సీఎం కేసీఆర్ అని జెడ్పీటీసి చౌట్‌పల్లి రవి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాల యంలో మండల బీఆర్ఎస్ నాయకు లతో కలిసి సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కురిసిన వడగండ్ల వాన వల్ల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు సీఎం కేసీఆర్ వ్యవసాయశాఖ అధికారులతో నష్టపోయిన రైతుల జాబితాను తయారుచేయించి నష్టపరిహారం అందించి రైతుబాంధవుడుగా ముందుకు వెలుతున్నాడని అన్నారు. సమావేశంలో యంపిపి ఆర్మూర్ మహేష్, ఏయంసీ చైర్మన్ గుణవీర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య, రైతుబంధు మండల అధ్యక్షుడు శర్మనాయక్ తదితరులున్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని జల్దిపల్లి గ్రామానికి చెందిన కల్లు శ్రీనివాస్‌కు రూ.25వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును శుక్రవారం పంపిణీ చేసినట్టు మండల అధ్యక్షుడు దివిటి రమేష్ తెలిపారు. జల్లిపల్లి గ్రామానికి చెందిన కల్లూరు శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రి పాలయ్యారు. నిరుపేద కావడంతో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ సకాలంలో స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.25 వేలు మంజూరు చేయించారు. కార్యక్రమంలో లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ దేవేందర్‌రెడ్డి, కార్యదర్శి అట్టెం శీను, ఇబ్రహీం, పీర్‌సింగ్, నర్సింలు పాల్గొన్నారు.

ఉచిత బస్సు సౌకర్యం ప్రారంభం



నవతెలంగాణ-గాంధారి

మండలంలోని మొండి సడక్ నుంచి కామారెడ్డి వరకు ఉచిత బస్సు సర్వీస్‌ను వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బస్సు సర్వీస్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సంద ర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు సంగెంరాజు మాట్లాడుతూ.. వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి స్వచ్ఛంద సేవ సంస్థ ద్వారా మొండి సడక్ నుంచి కామారెడ్డి వరకు ఉచిత బస్సు సర్వీసు ప్రారంభించినట్టు తెలిపారు. దీనిని పరిసర ప్రాంత ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రతిరోజు ఉదయం 9:30 గంటలకు మొండి సడక్ చౌరస్తాలో బస్సు ఉంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో గండివేట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జశ్వంత్ గౌడ్, మంగలి గంగారాం తదితరులు పాల్గొన్నారు.

సీడీసీ డైరెక్టర్‌గా బద్దం ప్రతాప్‌రెడ్డి

- కార్యవర్గ సభ్యులకు ఎమ్మెల్యే జాజాల సురేందర్ సన్మానం



చైర్మెన్, డైరెక్టర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని మోతే గ్రామానికి చెందిన బద్దం ప్రతాప్‌రెడ్డి సీడీసీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పాలకవర్గం సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరుకావాలని కోరుతూ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ను సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ ఐరెని నరసయ్యను, మోతె గ్రామానికి చెందిన బద్దం ప్రతాపరెడ్డిని ఎమ్మెల్యే శాలువా కప్పి సన్మానించారు. కమిటీ సభ్యులు, డైరెక్టర్లు రైతుల పక్షాన పని చేయాలనే ఆయన సూచించారు. కార్యక్రమంలో మహిపాల్‌రెడ్డి, మధుసూధన్, తిర్మల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలి

- జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్



పనులను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్/సదాశివనగర్

పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ తెలిపారు. పారిశుధ్య స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మండల కేంద్రంలో, కొడంగల్ గ్రామ వీధుల్లో శుక్రవారం తిరిగి పనితీరును చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంటు వ్యాధులు సోకకుండా ప్రతినిత్యం శానిటేషన్ పనులు చేపట్టాలని సూచించారు. మండల కేంద్రంలో జరుగుతున్న పారిశుద్ధ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా పనులను పరిశీలించి అధికారుల లోపల సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై గ్రామాలలో పారిశుధ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి, ఎంపీడీవో రాణి, ఎంపీఓ సూర్యకాంత్, పెద్దకొడప్‌గల్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన..

సదాశివనగర్ : పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం సదాశివనగర్, మల్లుపేట్ గ్రామాలలో పారిశుధ్య పనులను మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ పరిశీలించారు. రోడ్లు, మురికి కాలువలను శుభ్రం చేయాలని, పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. పాఠశాలను పరిశీలించి పనులు జరుగుతున్న తీరును చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణ, ఎంపీఓ సురేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, వార్డు మెంబర్‌లు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాలో 23 కోట్ల జమ

- సింగిల్ విండో చైర్మన్ దేవేందర్‌రెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో శుక్రవారం నాటికి ధాన్యం కొనుగోలు చేసిన రైతుల ఖాతాల్లో రూ.23 కోట్లు జమ చేసినట్టు లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ కూచంపల్లి దేవేందర్ రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లింగంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో 15 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు రెండు లక్షల 80 వేల 9503 బస్తాల వరి ధాన్యం అనగా లక్ష 12 వేల 381 క్వింటాళ్ల ధాన్యాన్ని 2281 మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్టు తెలిపారు. రైతులకు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఆయన వెంట కార్యదర్శి సందీప్, సిబ్బంది ఉన్నారు.

కులాన్ని అడ్డం పెట్టుకొని రాజకీయం చేయొద్దు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తాము ఏ పార్టీ కి కొమ్ము కాయడం లేదని, రెండో విడత గొర్ల కోసం ఏం చేశావని, కులాన్ని అడ్డం పెట్టుకొని రాజకీయం చేయొద్దని రాజారాం యాదవ్‌ని కుర్మ సంఘం ఉపాధ్యక్షులు హంగర్గ ఈరుగొండ అన్నారు. శుక్రవారం ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి గొల్ల కుర్మలను ఎక్కడ విమర్శించలేదని, కావాలని రాజకీయం చేస్తున్నారన్నారని తెలిపారు. నవీపేట్ మండలంలో వీడిసి కుల బహిష్కరణచేస్తే ఎవరు సహకరించలేదని, అప్పుడు గుర్తుకురాని గొల్ల కురుమలు ఇప్పుడు గుర్తుకొచ్చారా.. అని తెలిపారు. రెండవ విడత గొర్లకోసం డీడీలు కట్టి ఐదేళ్లుగా గొర్ల కోసం ఎదురుచూస్తున్నామని, రాజారాం యాదవ్ ఏం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా ఎదగాలని అనుకుంటే కులం కోసం పాటుపడాలి తప్ప రాజకీయం చేస్తే మాత్రం సరైన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కుర్మ, గొల్లలను ధనవంతులు చేస్తామని చెప్పి ఎక్కడ ఎలక్షన్ వస్తే అక్కడే గొర్లు ఇస్తున్నారు తప్ప మిగతా చోట్ల ఇవ్వడం లేదని అన్నారు. కార్యక్రమంలో మైత్రి రాజు, సంయుక్త కార్యదర్శి మోహన్, కార్యనిర్వాక సభ్యులు శాటాపూర్ సాయిలు, కోరి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

ఆరోగ్య సమస్యతో అల్లాడుతున్న కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తూ చేయూత నిచ్చారు. నసురుల్లాబాద్ మండలం దుర్కి గ్రామంలో కాలేయ వ్యాధితో బాధపడుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన ఓ వికలాంగుడికి కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. డీసీసీ డెలిగేట్, ఎంపీటీసీల ఫోరమ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు యలమంచిలి శ్రీనివాస్‌రావు ఆ యువకుడికి రూ.10వేలు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు నందుపటేల్, మాజీ ఎంపీటీసీ శంకర్ నాయక్, శివప్రసాద్ పాల్గొన్నారు.

'వీఆర్‌ఏల రెగ్యులర్' నిర్ణయంపై హర్షం

- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం
- కేసీఆర్ ధన్యవాదాలు తెలిపిన వీఆర్‌ఏలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

వీఆర్‌ఏలందరికీ పేస్కేల్ వర్తింపజేస్తూ రెగ్యులరైజేషన్ కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం పలు మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్‌తో పాటు, పలువురు ప్రజాప్రతినిధుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

ఎల్లారెడ్డి : పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ఎల్లారెడ్డి వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీఆర్‌ఏలను ఇతర ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేయడం ద్వారా వారికి రెగ్యులర్ స్కేల్ వచ్చే విధంగా తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల లోపు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారని కేబినేట్‌లో నిర్ణయం తీసుకొని తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎగుల శ్రీనివాస్, సెక్రటరీ వినోద్, కోశాధికారి క్యాస కాశిరాం, అన్నీ గ్రామాల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.



నసురుల్లాబాద్ : సీఎం, స్పీకర్ చిత్రపటానికి పాలాభిషేకం

నసురుల్లాబాద్ : వీఆర్‌ఏలకు ఉద్యోగ క్రమబద్ధీకరణకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటాలకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండల వీఆర్‌ఏలు పాలభిషేకం చేశారు. వీఆర్‌ఏల మండల అధ్యక్షులు నీరడి పెంటయ్య మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చాలీచాలని జీతాలతో పనిచేశామని, అదే తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వీఆర్‌ఏలందరికీ కనీస వేతనం రూ.11,500లకు పెంచారని గుర్తు చేశారు. కొన్ని రోజులు ఆలస్యమైనా గురువారం జరిగిన రాష్ట్ర మంత్రి క్యాబినెట్ సమావేశంలో వీఆర్‌ఏలందరికీ క్రమబద్ధీకరణ ఆమోదించడం చాలా సంతోషమన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు పంతంగి పిరయ్య, కోశాధికారి శాదుల్ల, సీనియర్ నాయకుడు బండారి బాబయ్య, బంగారు మైసయ్య, సాయిలు, సుదర్శన్, శ్రీనివాస్, దత్తు, కృష్ణ, మోహన్, కిరణ్ మండల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో..

లింగంపేట్ : వీఆర్‌ఏలు తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్‌ఏ సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం చేసినట్టు వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు అడ్డి రవికుమార్, ఉపాధ్యక్షులు రమేష్, కార్యదర్శి లక్ష్మీనారాయణ, రమేష్, సురేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : తహసీల్దార్ కార్యాలయం ఎదుట స్థానిక వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్, ఎంఎల్‌సీ కవిత చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు నారాయణ, దేవయ్య, సున్నం శ్రీనివాస్, సాయినాథ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



లింగంపేట్‌లో..

గాంధారి : వీఆర్‌ఏలందరికీ పేస్కేల్ వర్తింపజేస్తూ రెగ్యులరైజేషన్ కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి వీఆర్‌ఏలు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో గాంధారి మండలాధ్యక్షులు భూమన్న, ఉపాధ్యక్షులు గంగారాం, కోశాధికారి సర్దార్, డివిజన్ కమిటీ సభ్యులు సురేష్, బాల సాయిలు, సంగమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వీఆర్‌ఏలను రెగ్యులర్ చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు, స్పీకర్ శ్రీనివాస్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి సంతోషం వ్యక్తం చేశారు. టపాకాయలు పేల్చి ఒకరొకొకరు అభినందనలు తెలుపుకున్నారు.

డిమాండ్లను నెరవేర్చాలి

- మోకాళ్లపై నిలబడి వీఓఏల నిరసన

నవతెలంగాణ-విలేకరుల బృందం

బోధన్ : తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని వీఓఏలు కోరారు. శుక్ర వారం నాటికి వీఓఏల నిరవధిక సమ్మె 26వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మోకాళ్లపై నిలబడి తమ నిరసన చేపట్టారు. నిరసనలో రమేష్, విజయ్‌కుమార్, భూమయ్య, సుభాష్, శ్రీలత, కరుణ, భూలక్ష్మి ఈశ్వరి, కృష్ణవేణి, పంచశీలా, లక్ష్మి, జయలక్ష్మి, అరుణ, ఆశ్రాఫా, రాధా, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



వర్ని : ముగ్గులు వేసి నిరసన

వర్నిలో ముగ్గులతో ఐకేపీ వీవోఏల సమ్మె..

వర్ని : వీవోఏలు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ముగ్గులు వేసి సమ్మెను కొనసాగించారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమ్మెలో శివకుమారి, అశ్విని, షమీం, లింకిత, సప్న, జగపతిబాబు, మహేష్, గిరి సాయిలు, అను తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : తమ సమస్యలను పరిష్కరించాలని వీఓఏలు చేపట్టిన సమ్మె మండల కేంద్రంలో కొనసాగుతోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు రూ. 18వేల వేతనం ఇవ్వాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని వీవోఏల సంఘం అధ్యక్షులు గంగాధర్ డిమాండ్ చేశారు.



బోధన్ : మోకాళ్లపై నిలబడి నిరసన చేస్తున్న వీఓఏలు

కోటగిరి : మండల కేంద్రంలో ఉమ్మడి మండలంలోని వీవోఏల సమ్మె 26వ రోజుకు చేరుకుంది. మండలంలోని యూనియన్ ప్రతినిధులు అధ్యక్షురాలు సరిత, ఉపాధ్యక్షుడు సాయిలు, కార్యదర్శి రమేష్, కోశాధికారి సుమ, సహాయ కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంలోని ఇందిరా క్రాంతి పథకం (ఐకేపీ) వీవోఏలు సమ్మె కొనసాగిస్తున్నారు. కార్యక్రమంలో శోభ, సుదర్శన్, పోచయ్య, యూసుఫ్, కొమరవ్వ, లతా, కుమ్మరి పుష్ప, జంగం సంధ్య, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ఉపాధి పనులు పరిశీలన

నవతెలంగాణ-కోటగిరి

ఉమ్మడి మండలంలోని ఉపాధి హామీ పనులను ఎంపీడీవో మనోహర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించి ఉపాధి కూలీలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తలు తీసుకోవాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, ఉపాధి కూలీలకు టెంట్లు ఏర్పాటు చేయాలని కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.

అడ్మిషన్ డ్రైవ్ చేపట్టిన అధ్యాపకులు

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు శుక్రవారం మండలంలో అడ్మిషన్ డ్రైవ్ చేపట్టారు. 10వ తరగతి పాస్ అయిన విద్యార్థుల ఇంటికి వెళ్లి ఇంటర్‌లో చేరాలని ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్, విజ్ఞాన్, కృష్ణవేణి, వివేకానంద, తదితర పాఠశాలలో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థుల ఇండ్లలోకి వెళ్లి అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలలో విద్యను అభ్యసించడం వల్ల కలిగే ప్రయోజనాలను అధ్యాపకులు తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వం అందించే ఉచిత పాఠ్యపుస్తకాలు, స్కాలర్‌షిప్ సదుపాయం, బస్సు సదుపాయం, స్టడీ మెటీరియల్స్ అవన్నీ ఉచితంగా పొందవచ్చునని ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. జూనియర్ లెక్చరర్లు ఎస్.లక్ష్మణ్, జెట్టి విజయకుమార్, కె.రమేష్, స్వప్న, వెంకటస్వామి, జూనియర్ అసిస్టెంట్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గండివేట్ తండాలో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని గండివేట్ తండాలో ఉచిత వైద్యశిబిరాన్ని వైయస్సార్ టీపీ ఎల్లారెడ్డి కోఆర్డినేటర్ డాక్టర్ వెంకట్ జమున రాథోడ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గండివేట్ తండాలో సుమారు 250 మంది వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్ టీపీ గాంధారి మండల అధ్యక్షుడు హరిలాల్ రాథోడ్, ఉపాధ్యక్షుడు గంగారెడ్డి, యూత్ లీడర్ సంతోష్, స్థానిక సర్పంచ్ గంగారం, రాంజీ నాయక్ రాజగోపాల్, తండా నాయకులు, వైఎస్సార్ టీపీ నాయకులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నసురుల్లాబాద్/వర్ని

ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బాన్సువాడ డీఏఓ వినయ్ కుమార్ అన్నారు. శుక్రవారం బీర్కూర్ మండల కేంద్రంలో బీర్కూర్ రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు డి అశోక్‌తో కలిసి మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం రాయితీపై జీలుగ, జనుము విత్తనాలు అందిస్తుందని తెలిపారు. బీర్కూర్, బైరపూర్, దామరంచ సహకార సొసైటీల్లో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు విత్తనాలు పొందాలంటే తప్పనిసరిగా పట్టా పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, మొబైల్ నెంబర్ సమర్పించాల్సి ఉంటుందని వివరించారు.



వర్ని : జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కార్యక్రమంలో జెడ్పీటీసీ స్వరూప, మండల వ్యవసాయాధికారిని కమల, సీనియర్ ఏఈఓ శ్రావణ్ కుమార్, ప్రాథమిక సహకార సంఘం సీఈఓ విఠల్, డైరెక్టర్ రాములు, పోశెట్టి రైతులు తదితరులు పాల్గొన్నారు.

వర్ని : రుద్రూర్ మండలంలోని రాయకూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జీలుగ విత్తనాలను జడ్పీటీసీ నారోజి గంగారం ప్రారంభించారు. జీలుగా విత్తనాల ద్వారా రైతులకు దిగుబడి వస్తుందని, ఎకరానికి 30 కిలోల బస్తాను చల్లాలని వ్యవసాయ విస్తరణ అధికారి నగేష్‌రెడ్డి రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అక్కపల్లి సుజాత నాగేందర్, సొసైటీ చైర్మన్ పరుచూరి సంగమేశ్వర రావు, అక్బర్‌నగర్ సర్పంచ్ గంగామణి వరప్రసాద్, గోవింద్‌రావు, శ్రావణి, సొసైటీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మన ఊరు మనబడి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ జితిష్ వి పాటిల్

నవతెలంగాణ-రామారెడ్డి

మన ఊరు మనబడిలో ఎంపికైన పాఠశాల పనులను నాణ్యతతో, జూన్ 12 వరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం మండలంలోని మద్దికుంట మండల పరిషత్ పాఠశాలలో మన ఊరు మనబడిలో ఎంపికై పనులు మధ్యలోనే ఆగిపోవడంతో, పాఠశాలలోని పనులను పరిశీలించారు. సదరు కాంట్రాక్టర్‌కు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించగా, పనులు చేసిన డబ్బులు రాకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతుందని తెలిపారు. సంబంధిత డబ్బులను త్వరగా అందేలా చూస్తామని కలెక్టర్ తెలిపారు. గ్రామంలో గ్రంథాలయం, చదవడానికి గది, ఆట స్థలం కేటాయించాలని గ్రామ యువత, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించారు. డీఈఓ రాజు, ఎమ్మార్వో ఆనంద్, ఎంపీఓ సబితారెడ్డి, సర్పంచ్ రామ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రాజన్న, ఉపాధ్యాయులు మనోహర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

ప్రభుత్వ విప్‌తోనే నియోజకవర్గం అభివృద్ధి

నవతెలంగాణ-దోమకొండ

కామారెడ్డి నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మధుసూధన్, జడ్పీటీసీ తిర్మాల్‌గౌడ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామారెడ్డి నియోజకవర్గంలోని ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం ప్రభుత్వ విప్ కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షులు రావులపల్లి నర్సారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ కుంచాల శేఖర్, ఎంపీటీసీ సభ్యులు నిమ్మ శంకర్, కదారి రమేష్, కోఆప్షన్ సభ్యులు షమ్మీ, పార్టీ యూత్ మండలాధ్యక్షులు పాలకుర్తి శేఖర్, ఏఎంసీ డైరెక్టర్ ఆశంశెట్టి పోశయ్య, మాజీ ఎంపీటీసీ నల్లపు శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షులు బోరెడ్డి కిషన్‌రెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొమ్మెర శ్రీనివాస్, నాయకులు కానుగంటి నాగరాజు, నేతుల సుధాకర్, కుంచాల సత్యం, నిమ్మ రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ

బీసీల ఓట్లే కావాలి.. వారికి రాజ్యాధికారం వద్దా

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీసీల ఓట్లు మాత్రమే కావాలి.. వారికి రాజ్యాధికారం వద్దా.. అని జిల్లా అధ్యక్షుడు ఎం.నాగయ్య అన్నారు. ఈనెల 21న బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో జరగనున్న బీసీల సదస్సును విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 75 ఏళ్ల స్వాతంత్రంలో బీసీలు ఎందుకు రాజకీయంగా ఎదగలేకపోతున్నారని ఆలోచించాలని అన్నారు. జనాభాలో అధిక శాతం బీసీలు ఉన్నారని, బీసీలకు రాజ్యాధికారం ఎందుకు దక్కడం లేదని, అగ్ర కులాలు అనగదొక్కుతుంటే ఎన్నాళ్ళని చూస్తూ కూర్చుందామని, బీసీ లందరు మేలుకోవలసిన అవసరం ఎంతయిన ఉందని తెలిపారు. బీసీ ల ఐక్యత కోసం మే 21 జరిగే సదస్సుకు ముఖ్యఅతిథిగా బిసి రాజాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు దాసు సురేష్, విశిష్ట అతిథులు దొంత ఆనందం, విజిఆర్ నాగ గొని, సంఘం సూర్యారావు, తెలంగాణ విట్టల్ రానున్నారని తెలిపారు. బీసీలు పెద్ద సంఖ్యలు హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ సదస్సు న్యూ అంబేద్కర్ భవన్‌లో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అల్లుక నారాయణ జిల్లా ఉపాధ్యక్షులు, రమేష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి బింగి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన సర్పంచ్

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ సర్పంచ్ వికార్ పషా తెలంగాణ స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ తారీకు అన్సారీని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్పొరేషన్ చైర్మన్‌గా జిల్లా ఇన్చార్జి బాధ్యతలను స్వీకరించి వచ్చిన సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. నాయకులు కే సాయిలు, రఫీక్ ఖాన్, జదవరాజు తదితరులున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

నవతెలంగాణ-భిక్కనూర్

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి నాలుగు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై ఆనంద్ గౌడ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టిన సమయంలో ఎస్కే జునాద్ పాషా, రాజిరెడ్డి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న కారణంగా జిల్లా మెజిస్ట్రేట్ ప్రతాప్ రూ. 200 జరిమానాతో పాటు 4 రోజులు జైలు శిక్ష విధించారు. మద్యం సేవించి వాహనం నడిపితే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేత

నవతెలంగాణ-కోటగిరి

మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అధికారి మనోహర్ రెడ్డి ఎండాకాలం దృష్టిలో పెట్టుకొని ఉపాధి కూలీలు అస్వస్థతకు గురైనప్పుడు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని ఫీల్ అసిస్టెంట్లను ఆదేశించారు. అందులో భాగంగా శుక్రవారం ఫీల్డ్ అసిస్టెంట్లకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు.



ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
4
శనివారం 20 మే 2023

మద్యం మత్తులో కిందపడి ఒకరు మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

అతిగా మద్యం సేవించి కింద పడగా మృతి చెందాడని నాలుగవ పోలీస్ స్టేషన్లో కుటుంబ సభ్యులు గురువారం రాత్రి ఫిర్యాదు చేశారని నాలుగోవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సందీప్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. తన దేవరకొండ ప్రసాద్(42) పెయింటర్ గా పని చేస్తూ రోజు అతిగా మద్యం సేవించే వాడు. ఈనెల 17న రాత్రి ఇంట్లో ఎవరులేని సమయంలో అతిగా మద్యం సేవించి కింద పడగా మరణించాడు. దీనిపై భార్య సరిత ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ కుమార్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ టౌన్-1 ఆర్. చంద్రశేఖర్, ఏడీఈ టౌన్-2 తోట రాజశేఖర్, ఏడీఈ టౌన్ 3 పి. విరేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరం లో విద్యుత్ సరఫరాలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పవర్ హౌస్, మిర్చి కాంపౌండ్, తిలక్ గార్డెన్, సుభాష్ నగర్, బోర్గం, అర్సపల్లి, వినాయక నగర్, దుబ్బ న్యూ హౌసింగ్ బోర్డ్, గోపన్ పల్లి విద్యుత్ ఉపకేంద్రాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. మూడవ శనివారం నెలవారీ మరమత్తులో భాగంగా పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని దానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఖాళీ స్థలాల్లో నీరు నిల్వకుండా చూడాలి

- ప్రత్యేక అధికారి పద్మ
- ఆర్మూర్ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు ప్రారంభం
- శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పనులు పరిశీలన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/ఆర్మూర్/భీంగల్


కమ్మర్‌పల్లి


భీంగల్

ఖాళీ స్థలాల్లో నీరు నిల్వకుండా పంచాయతీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ప్రత్యేక అధికారిని పద్మ అన్నారు. శుక్రవారం మండలంలోని బషీరాబాద్ గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ కార్యక్రమంలో భాగంగా ఎవిన్యూ ప్లాంటేషన్, డ్రై డే ఫ్రైడే, ప్లాస్టిక్ సేకరణ, మురికి కాలువలు శుభ్రత పనులను సర్పంచ్ సక్కరం అశోక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా, చెత్తబుట్టలోనే వేయాలని అన్నారు. హరితహారంలో నాటిన మొక్కలకు, నర్సరీల మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించి కాపాడాలన్నారు. వర్షాకాలం రాబోతున్నందున మురికి కాలువలను శుభ్రంగా ఉంచాలని, మంచినీటి సరఫరా పైపులైన్లలో లీకేజీలు లేకుండా చూసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా పలు ఇండ్లలో కుండీల్లో, పాత వస్తువుల్లో నిల్వ ఉన్న నీటిని ఆరోగ్య సిబ్బంది పారబోశారు. పంచాయతీ సిబ్బంది రోడ్ల వెంట పిచ్చి మొక్కలను తొలగించి, చెత్తా చెదారాన్ని ఊడ్చి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కస్తూరి విక్రమ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు సక్కారం నారాయణ, నెల్ల రమేష్, ఆర్.పి. రాజు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్: పట్టణంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం ప్రారంభమైంది. తొమ్మిది రోజులపాటు ప్రతి రోజు నాలుగు వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా 3,25,26,23 వార్డుల్లో శుక్రవారం పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించినట్టు మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినితపవన్ తెలిపారు. కార్యక్రమంలో, కౌన్సిలర్ రేవతి గంగా మోహన్, మున్సిపల్ అధికారులు , పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

భీంగల్: మండలంలోని పిప్రి (జే) గ్రామంలో కొనసాగుతున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పనులను మండల ప్రత్యేకాధికారి నాగభూషణం పరిశీలించారు. రానున్న వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలను సీజనల్ వ్యాధుల నుండి రక్షించేందుకు గ్రామంలో చేపట్టాల్సిన శానిటేషన్ పనులను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. తాగే నీటిని ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని తెలియజేశారు. ఈయన వెంట యంపిడివో రాజేశ్వర్, సర్పంచ్ ప్రవీన్ కుమార్, యంపివో గంగమోహన్, ఉప సర్పంచ్ రవీంధర్, పంచాయతీ కార్యదర్శి శేఖర్ ,ఐకెపి సిసి సాయిలు తదితరులున్నారు.

హామీలను అమలు చేసేదేప్పుడు..?

నవతెలంగాణ-డిచ్‌పల్లి

వీవోఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయించడంలో అహర్నిశలు శ్రమిస్తామని, ఇప్పటికైనా ముఖ్య మంత్రి కేసీఆర్ సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఐకేపీ వీవోఏ ఇందల్‌వాయి మండల అధ్యక్షురాలు కె సరళ, ప్రధాన కార్యదర్శి రాము అన్నారు. తమ డిమాండ్ల సాధనకు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 26వ రోజుకు సమ్మె చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐకేపీ వీఓఏలకు ప్రభుత్వం భరోసా కల్పించడంలో మీనమేషాలు లెక్కిస్తుందని అన్నారు. ఇప్పటికైనా వీవోఏల సమస్యలను సానుకుల దృక్పథంతో పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కనీస వేతనాలు నెలకు రూ.18 వేలు, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ప్రమాద బీమా సౌకర్యం, అర్హులైన వారందరికీ సీసీలుగా నియమించాలని, యూనిఫామ్ కేటాయించాలని, ప్రమాద బీమా సౌకర్యం రూ. 10 లక్షల కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని వారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సువర్ణ, కోశాధికారి మమతా,సభ్యులు కవిత, సౌమ్య, అరుణ, స్వప్న అలేఖ్య, రాధికా, లావణ్య, భాగ్య, మౌనిక తోపాటు తదితరులు పాల్గొన్నారు.

నా భద్రత-నా పోలీసు కరపత్రాలు ఆవిష్కరణ


మహిళల భద్రత పై షీ టీం అవగాహన

నవతెలంగాణ-ముప్కాల్

వీవోఏలు తమ డిమాండ్ల సాధనకు చేస్తున్న సమ్మె శుక్రవారం 26 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆర్మూర్ డివిజన్ షీ-టీం పోలీసులు మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. ఆర్మూర్ డివిజన్ షీ-టీం హెడ్ కానిస్టేబుల్ సుమతి, కానిస్టేబుల్ విజ్ఞేష్ వీవోఏలకు మహిళల రక్షణ వివిధ అంశాలపై గంట సేపు అవగాహన కల్పించారు. నా భద్రత-నా పోలీసు కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ముప్కాల్ ఏఎస్సై గంగారాం 100 డయల్, సైబర్ నేరాలపై వివరించారు. కార్యక్రమంలో ముప్కాల్ ఏఎస్సై గంగారాం, కానిస్టేబుల్ లింబద్రి, రమాదేవి, వీవోఏల మండల అధ్యక్షురాలు అరుణ, ఏఎస్ఎం పద్మ, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

కూలి రూ.272 వచ్చేలా పనిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాలకిషన్

నవతెలంగాణ-రాజంపేట్

ప్రతీ కూలీకి సుమారుగా రూ.272 దినసరి కూలి పడేలా పనిచేయాలని ఎంపీడీవో బాలకిషన్ పేర్కొన్నారు. శుక్రవారం ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద లేబర్ శాతం పెంచుటకు, రూ.272 కూలీలకు అందేవిధంగా చేయుటకు తగు సూచనలు చేశారు. సమావేశంలో ఏపీవో భాస్కర్, టీప రాజు చారి, ఫీల్డ్ అసిస్టెంట్లు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ సహకారంతో గ్రామాల అభివృద్ధి

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సహకారంతో గ్రామాల అభివృద్ధి జరుగుతుందని సిద్ధరామేశ్వరనగర్ సర్పంచ్ జనగామ శ్రీనివాస్ తెలిపారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా ముదిరాజ్ సంఘం భవనానికి 4 లక్షలు, వీడీసీ భవన మరమ్మతులకు 4 లక్షలు, ముదిరాజ్ సంఘానికి బోరు మోటర్, హనుమాన్ ఆలయ నూతన నిర్మాణం, ఆలయ ప్రాంగణంలో బోరు మోటర్ మంజూరు చేసినట్టు తెలిపారు. గ్రామాభివృద్ధికి సహకరించిన ప్రభుత్వ విప్‌కు గ్రామస్తుల తరఫున ధన్యవాదాలు తెలిపి, గ్రామ ప్రజాప్రతినిధులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి జీలుగ విత్తనాలు పంపిణీ

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని రైతులకు శనివారం నుంచి 65శాతం సబ్సిడీపై జీలుగా విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు ఎడపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి రామేశ్వర్‌రావు శుక్రవారం తెలిపారు. ఎడపల్లి సహకార సంఘంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు.

ఆలయాల్లో న్యాయవాది పూజలు

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయం, శివరాం మందిర్ ఆలయాలలో భిక్కనూర్ మండల కేంద్రానికి చెందిన న్యాయవాది అయిన పెద్దపచ్చగారి రామ్‌రెడ్డి దంపతులు శుక్రవారం పూజలు నిర్వహించారు. చండీయాగం మహా యజ్ఞం కార్యక్రమాలను నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం జడ్పీటీసీ తీగల తిరుమల్‌గౌడ్, సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్ రాంరెడ్డి దంపతులను శాలువాతో సన్మానించారు. రామ్‌రెడ్డి హైదరాబాదులో ప్రస్తుతం న్యాయవాదిగా కొనసాగుతున్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సరెడ్డి, నల్లపు శ్రీనివాస్, కుంచాల శేఖర్, నాగరాజ్, భిక్కనూరు మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల కేంద్రంలో ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ అమ్మ డిజిటల్ ఫ్లెక్సీ వద్ద బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కురుమ సాయిబాబా వారి తల్లిదండ్రులు (కురుమ కాశయ్య - కురుమ విఠవ్వ)ల జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం వలన చలివేంద్రం ప్రారంభించినట్టు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గడ్డి వాము దగ్ధం


ఖుర్ద్ గ్రామంలో విద్యుత్ షాక్‌తో గాడి వాము దగ్ధం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని లింగంపల్లి ఖుర్ద్ గ్రామంలో శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో గ్రామానికి చెందిన గాలేం మల్లేషంకు చెందిన గడ్డివాము విద్యుత్ తీగలు తగిలి దగ్ధమైంది. మల్లేషంకు చెందిన పంట పొలం వద్ద పశువుల మేత కోసం 2ఎకరాల వరి పంట గడ్డిని వాము వేసుకుని ఉంచాడు. విద్యుత్తీగలు తగిలి ప్రమాదం జరిగి సుమారు రూ.25 వేలకు పైగా నష్టం వాటిల్లింది. ఘటనా స్థలాన్ని సర్పంచ్ బండి రాజన్న, ఎఫ్ఎస్‌వో కిష్టయ్య, వీఆర్ఏలు బాలయ్య, సాయులు, కిష్టయ్య, పోతరాజు స్వామీ, దుర్గయ్య తదితరులు పరిశీలించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని గోన్‌గొప్పుల, సికింద్రాపూర్ గ్రామంలో లబ్దిదారులకు జెడ్పీటీసి చౌట్‌పల్లి రవి, ఎంపిపి ఆర్మూర్ మహేష్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం అందజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్‌లు రాగి అనసూయ, బండారి సంధ్యగంగాధర్, యం పిటీసి గజేంధర్, పార్టీ మం డల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య, ఏయంసీ చైర్మన్ గుణ్‌వీర్‌రెడ్డి, భీంగల్ సొసైటీ చైర్మన్ నర్సయ్య, శర్మనాయక్ మరియు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించేందుకే పల్లె దవాఖానాలు

- ఎంపీపీ పాల్త్య విఠల్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

గ్రామీణ ప్రాంత నిరుపేదలకు వైద్య సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం పల్లె దవఖానాలను ఏర్పాటు చేసిందని ఎంపీపీ పాల్త్య విఠల్, మండలాధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండలంలోని గిరిజన గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పెర్క శ్రీనివాస్ మాట్లాడుతూ.. నసురుల్లాబాద్ మండల కేంద్రానికి పల్లె దవాఖాన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. పల్లె దవాఖానకు నిధులు మంజూరుకు కృషి చేసిన స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పల్లె ఆసుపత్రులను ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ దవాఖానాలు శనివారం మినహా అన్ని రోజులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని, అకాల వర్షంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అర్ధరాత్రి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఉండి రైతులకు అండగా ఉన్నారని గుర్తుచేశారు. ప్రజల సమస్యలే తమ సమస్యలుగా గుర్తించి పరిష్కారం చేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ నెంబర్ మాజీ మజీద్, వైస్ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ ఫోరం కన్వీనర్ రాము, గ్రామ పార్టీ అధ్యక్షుడు కంది మల్లేష్, నాయకులు ప్రతాప్ సింగ్, మైషగౌడ్, నర్సింలుగౌడ్, భూమయ్య, గంగారం, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఒకరు రిమాండ్

- రూ.12వేలు రికవరీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని మూడో పోలీస్ స్టేషన్ పరిధిలో తాళం వేసిన ఇంట్లో నుండి నగదును దోచుకున్న కేసును చేధించి ఒకరిని రిమాండ్ చేశారు. మూడో పోలీస్‌స్టేషన్ ఎస్ఐ శ్రావణ్‌కుమార్ వివరాల ప్రకారం.. నిజామాబాద్ నగరంలోని సుభాష్ నగర్‌కు చెందిన సుంకరి శ్రీధర్ కుమార్ ఇంట్లో ఈనెల 12న తన ఇంటికి తాళం వేసి తన హోటల్ కి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి నగదు దొంగలించుకుపోయారు. ఈమేరకు ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేశారు. సాంకేతిక ఆధారాలతో దొంగతనం చేసిన అంబేద్కర్ కాలనీకి చెందిన చెట్టిపల్లి భాస్కర్ దొంగిలించాడని ఒప్పుకోవడంతో నిందితుడిని అరెస్ట్ చేసి దొంగలించిన రూ.12వేల నగదును రికవరీ చేసి రిమాండ్‌కు పంపించారు. ఎవరైనా ఇంటికి తాళం వేసి ఊర్లకు వెళ్తున్నట్లైతే సమాచారం తెలపాలన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

- మాజీ ఎమ్మెల్యే గంగారం


నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్


క్విజ్ పోటీలను నిర్వహిస్తున్న ప్రజ ప్రతినిధులు

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జూన్ 2న రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే గంగారం అన్నారు. నియోజకవర్గంలో ఉన్న 16 నుంచి 35 సంవత్సరాలలోపు యువతీ, యువకులు, విద్యార్థులు క్విజ్ పోటీలకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా, తెలంగాణ యువశక్తిని మేల్కొల్పే దిశగా జూన్ 2న తెలంగాణ అవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ ఉంటుందన్నారు. ఈ క్విజ్‌లో 60 ప్రశ్నలు 60 నిమిషాలలో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 16 నుంచి 35 సంవత్సరాలలోపు యువతీ, యువకులు, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 7661899899 నెంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్ కోసం వెబ్‌లింక్‌తో కూడిన ఎస్ఎంఎస్ వస్తుందన్నారు. ఆ లింకు ద్వారా వారి వివరాలను అందులో జూన్ 1లోగా నమోదు చేసుకోవాలని తెలిపారు. పోటీలో పాల్గొన్న అభ్యర్థులకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రథమ బహుమతి కింద ల్యాప్‌టాప్, ద్వితీయ బహుమతి కింద స్మార్ట్‌ఫోన్, తృతీయ బహుమతి కింద ట్యాబ్‌తోపాటు నియోజకవర్గానికి 40 ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. ఈ ప్రోత్సాహక బహుమతుల్లో 10స్మార్ట్ వాచ్‌లు, 10 ఇయర్‌పాడ్లు, 10 హార్డ్ డ్రైవ్‌లు, 10 పవర్‌బ్యాంకులు బహుకరిస్తామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని మహిళా టాపర్లకు ప్రత్యేక బహుమతి కింద ఎలక్ట్రిక్ స్కూటర్లను సోనియా గాంధీ అందజేస్తారన్నారు. క్విజ్‌లో జనరల్ నాలెడ్జ్, తెలంగాణ ఉద్యమంతోపాటు తెలంగాణ సామాజిక అంశాలపై ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గంగారం, కాంగ్రెస్ పార్టీ పెద్దకొడప్‌గల్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రణయ్‌రెడ్డి, నాయకులు అరవింద్, మహేందర్‌రెడ్డి, మోహన్, జిల్లెల్ల విట్టల్, కట్టెపల్లి పర్వయ్య తదితరులు పాల్గొన్నారు.

10 మొబైల్ ఫోన్లను రికవరీ

- అభినందించిన ఏసీపీ కిరణ్ కుమార్


మొబైల్ ఫోన్లను రికవరీ చేసిన ఎస్‌హెఓ విజయ్ బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఒకటవ పోలీస్ స్టేషన్ ఎసెహెచ్ఓ విజయ్ బాబు నేతృత్వంలో పోగొట్టుకున్న 10 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు శుక్రవారం తెలిపారు. ఈనెల 18న నిజామాబాద్ ఒకటవ పోలీస్ స్టేషన్లో సిఇఐఆర్ పోర్టల్ ద్వారా 10 మొబైల్ ఫోన్లను రాత్రి రికవరీ చేసినట్టు చెప్పారు. గుర్తుతెలియని వ్యక్తుల నుండి తక్కువ ధర కి మొబైల్ ఫోన్స్ కొనుగోలు చేసి మోసపోవద్దని తెలిపారు. సిఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి తిరిగి బాధితులకి అప్పగించడం జరిగిందన్నారు. మొబైల్ ఫోన్లను భద్రంగా పెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. రికవరీ చేసిన పది మొబైల్ ఫోన్లను నిజామాబాద్ ఏసిపి కిరణ్ కుమార్ నిజామాబాద్ ద్వారా బాధితులకు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో అప్పగించినట్టు తెలిపారు.

నష్టపరిహారం మాటలకే పరిమితమైంది

- మిల్లర్లు కడ్తా పేరుతో దోచుకుంటున్నరు
- కిసాన్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఆదిరెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నష్టపరిహారం మాటలకే పరిమితమైందని, మిల్లర్లు కడ్త పేరుతో నౌతెలపే దోచుకుంటున్నారని కిసాన్‌కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఆదిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ భవన్‌లో కిసాన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ముప్పగంగారెడ్డి అధ్యక్షతన జిల్లా కిసాన్ కాంగ్రెస్ సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఇన్చార్జ్ ఆది రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో వడ్లు రాలిపోయాయని, కోత కోసి కుప్ప చేసిన వరిధాన్యం పూర్తిగా తడిసిపోయి నీళ్లలో కలిసిపోవడంతో రైతులు తీవ్రంగా బాధపడుతున్నారని అన్నారు. మరో పక్క తడిసిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు తీసుకోవడం లేదని, ప్రభుత్వం ఆలస్యంగా తూకంవేసి ధాన్యాన్ని తరలించడంతో రైస్‌మిల్లర్లు కడ్త పేరుతో రైస్ మిల్లర్లు రైతులను దోచుకుంటున్నారని, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తామని కేవలం మాటలకే పరిమితమైందని అన్నారు. రైతులు నష్టపోతున్నా ఒక్క ఎమ్మెల్యే కూడా రైతుల దగ్గరికి వచ్చి వారి బాధలు తెలుసుకోవడం లేదని ఆయన అన్నారు. రైతుల పక్షాన కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు ఉంటుందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, దానికోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కష్టపడి పని చేయాల్సి ఉంటుందని అన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు ఒత్తిడి తెస్తామని ఆయన అన్నారు. సమీక్ష సమావేశానికి హాజరుకాని కిసాన్ కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మోర్తాడ్ మండల్ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మహిపాల్, వేల్పూర్ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, కమ్మర్‌పల్లి కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రవీణ్, డిచ్‌పల్లి కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిరెడ్డి, మోపాల్ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యంరెడ్డి, బోధన్ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మందర్న రవి, గాండ్ల సంతోష్, శంకర్, గొనివర్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


హత్యకు గురైన కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గత నెలలో హత్యకు గురైన కుటుంబానికి తనవంతుగా మానవత దృక్పథంతో సహాయం అందజేసి అండగా నిలిచారు తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ ఉపాధ్యక్షులు, ధర్పల్లి మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి. ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామానికి చెందిన అక్బర్ అలియాస్ నబిసాబ్‌ను గతనెలలో హత్య చేశారు. ఈ విషయం తెలుసుకుని బాధిత కుటుంబానికి తనవంతుగా పదివేల రూపాయల ఆర్థిక సహాయం, బియ్యాన్ని శుక్రవారం బాధిత కుటుంబానికి కలిసి అందజేశారు. జరిగిన సంఘటనపై వివరాలను అడిగి తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు. అయన వెంట అబ్దుల్ అజీజ్, అబ్దుల్ మోహిస్సిన్ ఉన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త 17 మంది భాధితులకు రూ.8లక్షల 49వేల సీఎంఆర్ఎఫ్ చెక్కునుని శుక్రవారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ బిగాల మాట్లాడుతూ... నిజామాబాద్ నగర ప్రజలు అత్యవసర సమయాల్లో ప్రయివేటు హాస్పటల్‌లో చికిత్స పొందితే సంబంధిత బిల్లులతో సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకొంటే వీలయినంత సహాయాన్ని ప్రభుత్వం ద్వారా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సుజిత్ సింగ్ ఠాకూర్, సూదం రవి చందర్, సిర్ప రాజు, శివ చరణ్, తఢ్కల్ శ్రీనివాస్ బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

నిజామాబాద్ నగరంలోని 19వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త కాడసి శ్రవణ్ కుమార్ కరెంట్ షాక్‌తో మరణించాడు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ద్వారా మంజూరైన 2 లక్షల ప్రమాద బీమా చెక్కుని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కుటుంబ సభ్యులకు అందచేశారు. పార్టీకి కార్యకర్తలు పునాదుల లాంటి వారని, వారికి ఏ ఆపద వచ్చినా ఎళ్ల వేళలా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సుజిత్ సింగ్ ఠాకూర్, సూదం రవి చందర్, సిర్ప రాజు,శివ చరణ్, తఢ్కల్ శ్రీనివాస్, గంగమని, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.